క్లుప్తంగా

నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బొమ్మనహాల్ మండలం, చంద్రగిరి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తి శెట్టి హత్య కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంతకల్లు బీజేపీ నాయకులు సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంజనేయస్వామి ఆలయానికి అర్చకుడిగా పనిచేస్తూ ధార్మిక భావాలు కలిగిన వ్యక్తిపై భోజనం చేస్తున్న సమయంలో వేటకొడవళ్లతో దాడి చేయడం దారుణమన్నారు. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి మరోసారి ఇలాంటివి పునరావృతంకాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

గుంతకల్లుటౌన్: కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర్‌లో జరిగిన మూడవ ఓపెన్ ఇన్విటేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఏఎస్ గోజు రాయ్ కరాటే అకాడమీకి చెందిన 12 మంది బాల బాలికలు ప్రతిభ కనబరిచారు. బంగారు, వెండి, కాంస్య పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు పొందినట్లు అకాడమీ నిర్వాహకుడు దినేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పీఎం స్వనిధి పథకంపై శిక్షణ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి వీధి విక్రయదారుల ఆత్మ నిర్బర్ నిధి-పీఎం స్వనిధి పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధి , చిరు వ్యాపారులు, మెప్మా సిబ్బంది హాజరైయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తోపాటు మెప్మా టీఎంసీ శ్రీనివాసరెడ్డి పీఎం స్వనిధిపై అవగాహన కల్పించారు. స్వనిధి యొక్క విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ జానకిరామిరెడ్డి, సీఓలు చంద్రశేఖర్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆధార్ కేంద్రాలు

పెద్దవడుగూరు: విద్యార్థులకు ఆపార్ జనరేషన్ కోసం ఇబ్బందులు కలుగకూడదని పెద్దవడుగూరు, క్రిష్టిపాడు జెడ్పీ పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈఓ-2 గురుప్రసాద్ తెలిపారు. విద్యార్థుల ఆధార్‌లోని తప్పులను పరిష్కరించడానికి ప్రధానోపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు సహకరించాలన్నారు. ఆధార్‌లో అప్‌డేట్ చేయడం కోసం విద్యార్థులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ తీసుకువెళ్లాలన్నారు.


ట్రాక్టర్లకు జరిమానా

తాడిపత్రి రూరల్: మండలంలోని తాడిపత్రి-బుగ్గ రహదారిలో సోమవారం అధిక లోడ్‌తో వెళుతున్న తొమ్మిది బండల ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించి, యజమానులకు రూ.15,315లు జరిమానా విధించామన్నారు.

ఈ-స్టాంప్‌ల కొరతపై ధర్నా

గుంతకల్లు: ఈ స్టాంప్‌ల కొరతపై పట్టణ సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-స్టాంపులు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బర్త్, డెత్ సర్టిఫికెట్లు, హౌస్ ట్యాక్స్, అగ్రిమెంట్లు, బ్యాంకు రుణాలకు ఈ- స్టాంపులు చాలా అవసరం. వాటి కొరత కారణంగా స్టాంప్ వెండర్లు వంద రూపాయలు బాండును రూ.150 నుంచి రూ.200కు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాకే నాగరాజు, మారుతి ప్రసాద్, జగ్గిలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్ర, తిమ్మప్ప, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.


'కార్తీకం' విశిష్టత తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రభోద సేవాసమితి సభ్యులు

గుంతకల్లు రూరల్: కార్తీక మాసం విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత భగవద్గీత సభ్యులు సూచించారు. ప్రభోద సేవాసమితి నాగసముద్రం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పాత కొత్తచెరువు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికీ పర్యటించి కార్తీక మాసం, కార్తీక సోమవారం, కార్తీక దీపం తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులతో పాటు వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు బయటకు వెళ్తే.. వారు ఇంటికి చేరుకునేంత వరకూ తల్లిదండ్రుల ఆందోళన అంతా ఇంతా కాదు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పట్టణవాసులు కోరారు.



యల్లనూరు రోడ్డులో జయనగర్ కాలనీకి వెళ్లే దారికి ఇరువైపులా ట్రాన్స్‌ఫార్మర్లు

అధికారుల నిర్లక్ష్యం..

ప్రజలకు ప్రాణ సంకటం

- జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

తాడిపత్రి అర్బన్: విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో పట్టణవాసులు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నివాస గృహాలను అనుకునే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లున్నాయి. దీంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బయటకు ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారులు తిరిగి ఇంటికి వచ్చే వరకు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని జీవిస్తున్నారు. ఇళ్ల పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని పలుమార్లు స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినాపట్టించుకోవడం లేదని పలువురు మహిళలు వాపోయారు. పట్టణంలోని సీబీ రోడ్డులోని విజయ బార్, యల్లనూరు రోడ్డులోని పలు ప్రాంతాల్లో, విజయనగర్ కాలనీలోని కాల్వగడ్డ వీధి, శ్రీరాముల పేట తదితర ప్రాంతాల్లో నివాసాల సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో పాటు సమీపంలోనే రహదారి ఉండడంతో అటు వైపు వెళ్లాలంటే వాహనదారులు, పాదచారులు భయంతో వణికిపోతున్నారు. అదేవిధంగా శ్రీరాములపేటలో ఇళ్ల మధ్యనే ఆనుకుని చిన్నిపిల్లలకు సైతం చేతికందే విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో.. చిన్నపిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు సాహసించడం లేదు.



కాల్వగడ్డ వీధిలో చేతికందే ఎత్తులో ఇళ్ల పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



క్రిష్ణాపురం 4వ రోడ్డులో ఇంటి ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



పుట్లూరు రోడ్డులోని రవీంద్రభారతి పాఠశాల వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నిత్యం భయం..భయం..

పుట్లూరు రోడ్డులో ఉన్న రవీంద్రభారతి కాన్సెప్ట్, సాయివిజేత కాన్సెప్ట్ స్కూళ్ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను భయపెడుతున్నాయి. నిత్యం ఈ ట్రాన్స్‌ఫార్మర్ల మధ్య 2 వేల మంది చిన్నపిల్లలు పాఠశాలలకు వస్తుంటారు. స్కూలు వదిలినపుడు తల్లిదండ్రులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తమ పిల్లలను స్కూలు నుంచి ఇంటికి పిలుచుకుని వెళ్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్లను వాహనాలు ఢీ కొట్టిన సందర్భాలు అనేకం. ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ట్రాన్స్‌కో అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నివాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏడీఈ ప్రభాకర్‌ను సాక్షి వివరణ కోరగా తాను బదిలీపై ఇటీవలే తాడిపత్రికి వచ్చానన్నారు. డి1 ఏఈతో చర్చించి కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు చేపడతామన్నారు.

కంచె ఏర్పాటు చేయాలి



ఇళ్ల ప్రక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో గాలీవాన వచ్చినపుడు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని గడుపుతున్నాం. ఈ విషయమై పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. కానీ వారి నుంచి స్పందన కరువైంది.

– గంగులకుంట కేశవరెడ్డి, తాడిపత్రి.

స్కూల్‌కు పంపాలంటే భయం



ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న దారిలో పిల్లలను స్కూలుకు పంపాలంటే భయంగా ఉంది. రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రాంతం నుంచి స్కూలుకు వెళుతుంటారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను పాఠశాలలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి.

– కాశీ మనోజ్, తాడిపత్రి

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



గుంతకల్లు మండలం దోనిముక్కల సచివాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



తాడిపత్రి మండలం సజ్జలదిన్నె సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/గుత్తి/పెద్దవడుగూరు/పామిడి/తాడిపత్రి రూరల్: మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం గుంతకల్లులోని ధోనిముక్కల సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరుపేదలకు స్థలాలను మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్‌ను కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన రోడ్లు, తాగు, సాగునీరు, విద్యుత్, డ్రైనేజీల తదితర మౌలిక వసతులు పూర్తి స్థాయిలో సమకూర్చాలని, పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాము రాయల్ ఇతర నాయకులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలోని సచివాలయ ఎదుట సీపీఐ నాయకులు, కార్మిక సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. మండల కార్యదర్శి రామదాసు, నాయకులు రాజుయాదవ్, రమేష్, మధు, నరసింహయ్య, షఫి, మహమ్మద్, నూర్జాహాన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరులో నిర్వహించిన ధర్నాలో మండల నాయకుడు వెంకట్రాముడుయాదవ్, నారాయణ, ఓబిరెడ్డి, ఆదినారాయణ, పోలా రంగస్వామి, రంగనాయకులు, అల్లాబకాస్, శేషుగోపాల్, ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పామిడిలో నిర్వహించిన ధర్నాలో మండల నాయకులు రహీమ్, నాగరాజు, ఓంకార్, చౌడప్ప, రాముడు, శివన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి మండలంలోని ఆలూరు, సజ్జలదిన్నె, గన్నెవారిపల్లి-1,2 సచివాలయాల ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేశారు. సీపీఐ నియోజక వర్గ అధ్యక్షుడు రంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, ఓబులేసు, గోపాల్, గోపాలక్రిష్ణ, ఎర్రప్ప, నాగార్జున, సురేష్, భవాని, మునెమ్మ, లక్ష్మిదేవి, రామలక్షుమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

గార్లదిన్నె/పెద్దవడుగూరు/తాడిపత్రిటౌన్: వారోత్సవాల సందర్భంగా గార్లదిన్నెలోని గ్రంథాలయంలో మండల కేంద్రం ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులకు సోమవారం వ్యాసరచన , వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి శిరిష తెలిపారు. అలాగే పెద్దవడుగూరులోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. తాడిపత్రి పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రవికుమార్ కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరారెడ్డి, లెక్చరర్‌లు రామాంజనేయులు, నాగరాజు, ఆదినారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పనివేళల పెంపు ఉపసంహరించుకోవాలి



పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయంపై నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాడిపత్రిటౌన్: ప్రభుత్వ పాఠశాలల పనివేళలను సాయంత్రం 5గంటల వరకూ పెంచడాన్ని ఏపీటీఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని జేసీ నాగిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డేనియల్ అధ్యక్షతన తాడిపత్రి జోనల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పిల్లలు 5 - 10 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తుంటాన్నారని, పాఠశాలను సాయంత్రం 5 వరకూ నిర్వహించడం వల్ల విద్యార్థులు తిరిగి ఇళ్లకు చేరుకోవడానికి ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రఘురామిరెడ్డి, నరసింహులు, రాందాస్‌రెడ్డి, అంకాలు, ఓబయ్య, విశ్వనాథ్, రామ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

25న గంగా హారతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయ ఆవరణలో ఈ నెల 25న సాయంత్రం గంగ హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు అన్నామలై స్వామి సోమవారం తెలిపారు. భక్తులు హాజరై మహా శివుడి ఆశీస్సులు పొందాలన్నారు.

రైల్వేగేట్ మూసివేత

పామిడి: పామిడి-కల్లూరు సెక్షన్ నడుమ పామిడిలోని 243/14-16 మైలురాయి వద్ద ఉన్న ఎల్‌సీ గేట్ నంబర్ 143ను ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు కల్లూరు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు గద్దం రవిబాబు సోమవారం తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా గేట్ మూసివేస్తామన్నారు. పామిడి నుంచి ఎద్దులపల్లి తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు గమనించాలన్నారు. రోడ్డు డైవర్షన్‌లో భాగంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

హంద్రీ-నీవా కెనాల్‌ను వెడల్పు చేయాలి

గుంతకల్లుటౌన్: హంద్రీ-నీవా మెయిన్ కెనాల్‌ను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచి సాగు, తాగునీరందించాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలసాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సాగునీటి బడ్జెట్‌లో సీమలోని నీటి ప్రాజెక్టులకు కేవలం 15 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. రాయలసీమ భూభాగం 46 శాతం ప్రకారమే నిధులను కూడా 46 శాతం కేటాయించాలన్నారు. 40 టీఎంసీల నీరు హంద్రీ ద్వారా ప్రవహించినప్పటికీ, జిల్లాలో 1400 చెరువులకు గానూ 150 చెరువులు మాత్రమే నింపగలిగారన్నారు. హంద్రీ-నీవా మెయిన్ కాలువ నుంచి పిల్ల కాలువలను ఏర్పాటు చేసి రాయలసీమ జిల్లాలల్లో 6,02,500 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, నాయకులు జిలాన్, సత్తార్, నారాయణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

శింగనమల: మండలంలోని తరిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దిల్షాద్ వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మోడల్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకన్న సోమవారం తెలిపారు. రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు గుడివాడలో జరిగాయన్నారు. సిల్వర్ మోడల్ సాధించిన దిల్షాద్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థిని ఆచూకీ లభ్యం

యాడికి: కనిపించకుండాపోయిన కేజీబీవీ విద్యార్థిని ఆచూకీ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని యల్లనూరు మండలం కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 3న ఇంటికి వెళ్లిన విద్యార్థిని శనివారం కేజీబీవీకి పోతానని చెప్పి పోలేదు. విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. విద్యార్థి దగ్గర ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లిందని గుర్తించారు. సోమవారం యాడికికి తీసుకువచ్చి విద్యార్థినిని తల్లికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

పక్షవాతం బాధితులకు ఆర్థికసాయం

యాడికి: మండల కేంద్రంలోని ఆస్పత్రి కాలనీకి చెందిన చేనేత కార్మికురాలు నాగమ్మతో పాటు కుమారుడు నాగరాజు, కోడలు పక్షవాతానికి గురయ్యారు. ఆ కుటుంబఆర్థిక పరిస్థితిని గుండా నారాయణ స్వామి ద్వారా తెలుసుకున్న విజయవాడకు చెందిన కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ మూర్తి చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని నాగమ్మకు అందజేశారు. కార్య క్రమంలో ఖాదీ సంస్థల సెక్రటరీలు లింగం చంద్రశేఖర్, మురళి, గుండా ఓబులేసు, చింతా తిరుమలేసు, కుండా లక్ష్మినారాయణ, రామప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.





గుంతకల్లులోని బుగ్గ సంగమేశ్వరాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు , గుత్తి మండలం కరిడికొండ మారెమ్మ ఆలయ ఆవరణలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

మార్మోగిన శివ నామస్మరణ



తాడిపత్రిలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్/బుక్కరాయసముద్రం/యల్లనూరు/పామిడి: కార్తీక మాసం కావడంతో గుంతకల్లు, తాడిపత్రి, శింగమనల నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలన్నీ కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో భక్తు తెల్లవారుజాము 4 గంటలకే ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, మహిళలు ఆలయాల ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





యల్లనూరులో శివుడు, బుక్కరాయసముద్రంలో కాశీ విశ్వేశ్వరుడు



పామిడిలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గురప్పస్వామి పొంగుపాలు పూజా కార్యక్రమం



పామిడిలో భోగేశ్వరుడికి సహస్ర దీపాలంకరణ చేసిన అర్చకులు, భక్తులు



పామిడి భోగేశ్వరాలయంలో కేదారేశ్వరస్వామి వ్రతం చేస్తున్న దృశ్యం

రేపు మునిసిపల్ హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఎట్టకేలకు జిల్లాలో కార్పొరేషన్, మునిసిపల్ స్కూళ్ల టీచర్ల పదోన్నతుల్లో కదలిక వచ్చింది. ఈనెల 6న జరగాల్సిన ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ఈనెల 20న చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన తుది సీనియార్టీ జాబితాలను సోమవారం విడుదల చేశారు. హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో 20న పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. **మొత్తం 6 పోస్టుల భర్తీ..** అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 3 హెచ్‌ఎం పోస్టులు, మునిసిపాలిటీల్లో 3 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో నేతాజీ నగరపాలక స్కూల్ ఎస్‌ఏ బయాలజీ టీచర్ ఎస్.లక్ష్మి మొదటి పేరులో ఉండగా, తర్వాత వరుసగా శారదా నగరపాలక ఉన్నత పాఠశాలకు చెందిన గణితం టీచర్ ఎం.శ్రీదేవి, గణితం టీచర్ వై.రేణుక, సోషల్ టీచర్ ఎస్.వాసుకి, గణితం టీచర్ ఎస్.శ్రీలత, బయాలజీ టీచర్ ఎం.రజియాబేగం ఉన్నారు. మునిసిపాలిటీలకు సంబంధించి రాయదుర్గంలో రెండు, గుంతకల్లులో ఒక హెచ్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఫైనల్ సీనియార్టీ లిస్టులు ప్రకటించామన్నారు. ఈనెల 20న హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ చేపడతామన్నారు.